క్లుప్తంగా

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏడీ ప్రకాష్

గంట్యాడ: బీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా పంట తొలిదశలో ఆశించే చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం ఏడీ ప్రకాష్ అన్నారు. మండలంలోని వసాది గ్రామంలో శుక్రవారం విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతీ రైతు వరి విత్తనాలు పొలంలో చల్లే ముందు వాటిని బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి చేయడం వల్ల చీడపీడలు, తెగుళ్ల బెడద ఉండదన్నారు. ప్రకృతి సాగు పద్ధతిలో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు.

జనసేన నాయకుల రాద్ధాంతం



డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ ఫొటో పెట్టకపోవడంపై ఎంపీడీఓను నిలదీస్తున్న జనపార్టీ నేతలు

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కళావెంకటరావు శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అయితే మండల పరిషత్ కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడు ఫొటో పెట్టి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ ఫొటో పెట్టకపోవడంపై చీపురుపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వి.శ్రీను రాద్ధాంతం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ పావనికి సూచించారు.

ఘన సత్కారం



వెంకటరమణను సత్కరిస్తున్న పెద్దబంటుపల్లి హైస్కూల్ సిబ్బంది

గుర్ల: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైనా కంది వెంకటరమణను పెద్దబంటుపల్లి హైస్కూల్ సిబ్బంది పాఠశాల వద్ద శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెద్దబంటుపల్లి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించి వారి మన్నలను పొందాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా పెద్దబంటుపల్లి పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడైనా వెంకటరమణ ఎన్నిక కావడం సంతోషంగా ఉందని సహచర ఉపాధ్యాయులు అన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు ఫిజియోథెరఫీ సేవలు సంపూర్ణంగా అందేలా చూడాలని ఎంఈఓ విమలమ్మ అన్నారు. భవిత కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆమె సందర్శించారు. కేంద్రంలో ఉన్న పిల్లల అభ్యసన స్థాయిలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఐఈఆర్‌టీ శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఆశీల వేలం పాట

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో రోజువారీ ఆశీల వేలాన్ని స్థానిక సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి, పంచాయతీ ఈఓ జనార్దనరావు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గ్రామ సచివాలయం-2లో నిర్వహించారు. ఈ వేలంపాటలో ఐదుగురు సభ్యులు పాల్గొనగా.. పురిటిపెంటకు చెందిన శనపతి బంగారమ్మ రూ.1.69 లక్షల వరకు పాడారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన రూ.2.60 లక్షల కంటే పాటదారులు తక్కువ పాడటంతో దీన్ని డీఎల్‌పీఓ దృష్టికి తీసుకువెళ్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాటను ఖరారు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఘనంగా పుట్టినరోజు వేడుక



కేక్ కట్ చేస్తున్న బొత్స సాయిగురినాయుడు

గజపతినగరం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తనయుడు బొత్స సాయిగురినాయుడు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, సీనియర్ నేతలు అంతా చెరుకొని గురినాయుడుకు పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, గజపతినగరం, దత్తిరాజేరు జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, స్థానిక ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, తదితరులు గురినాయుడు శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



దత్తిరాజేరు: భూపాలరాజపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఏఓ అనురాధ



బొండపల్లి: గొట్లాంలో సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేస్తున్న ఏఓ మల్లికార్జునరావు, నాయకులు



గజపతినగరం: కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ధనలక్ష్మి



లక్కవరపుకోట: గొల్జాంలో కౌలు రైతుల గుర్తింపు సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ స్వాతికుమారి



ఎస్.కోట: ఎస్‌జీపేటలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవీంద్ర

దత్తిరాజేరు: అర్హత ఉన్న కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డు(సీసీఆర్‌సీ)లు మంజూరు చేయడం జరుగుతుందని తహసీల్దార్ సుదర్శన్ అన్నారు. మండలంలోని భూపాలరాజపురంలో సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు అధ్యక్షతన శుక్రవారం కౌలు రైతులను గర్తించేందుకు గ్రామసభ నిర్వహించారు. భూమి లేని నిరుపేదలు పెద్ద రైతుల వద్ద కొంత భూమిని తీసుకొని కౌలు చేస్తూ జీవనాధారం సాగిస్తున్నట్లయితే వారికి కౌలు కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కౌలు కార్డులు కలిగిన రైతులకు ఎరువులు, విత్తనాలు, ఇతర ప్రభుత్వ పథకాలను అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ అనురాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులు అందజేత

బొండపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ కౌలు రైతు గుర్తింపు కార్డు(సీసీఆర్‌సీ)లు మంజూరు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి పీవీ మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని గొట్లాం, బొండపల్లి రైతుసేవా కేంద్రాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించారు. సీసీఆర్‌సీ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బొండపల్లి, గొట్లాం పంచాయతీల సర్పంచ్‌లు బొండపల్లి ఈశ్వరరావు, మండా ఆదిలక్ష్మి, మీసాల తులసీరాం, కోరాడ కృష్ణ, ఏఈఓ సంతోష్ కుమార్, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

గజపతినగరం: భూమిని కౌలుకు సాగుచేసే ప్రతీ రైతు కౌలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పురిటిపెంట ఆర్‌బీకేలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో సీసీఆర్‌సీ కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. కౌలు గుర్తింపు కార్డులు కలిగిన రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్, ఇతర సంక్షేమ పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. మండలంలో 778 సీసీఆర్‌సీ కార్డుల మంజూరు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 661 కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అర్హత కలిగిన రైతులు ఈ నెల 10వ తేదీలోగా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లక్కవరపుకోట: అర్హత కలిగిన కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేస్తోందని, వాటిని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ స్వాతికుమారి అన్నారు. మండలంలోని రంగారాయపురం, రంగాపురం, కల్లేంపూడి, గొల్జాం గ్రామాల్లో శుక్రవారం కౌలు రైతుల గుర్తింపు సమావేశాలు నిర్వహించారు. రైతుల నుంచి కొంత భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవారంతా సీసీఆర్‌సీ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్డు ఉంటే బ్యాంకుల నుంచి రుణాలతో పాటు వ్యవసాయశాఖ ద్వారా అమలు చేసే పథకాలు పొందవచ్చన్నారు.

శృంగవరపుకోట: కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న గుర్తింపు కార్డులను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవీంద్ర అన్నారు. మండలంలోని సంతగవిరమ్మపేట, తిమిడి, కొత్తూరు, ఉసిరి, చినఖండేపల్లి గ్రామాల్లో శుక్రవారం సీసీఆర్‌సీ కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. పంట నమోదు, పంట నష్టం, ధాన్యం కొనుగోలు, పంటల బీమా, బ్యాంక్ రుణాలు, తదితర సౌకర్యాలు పొందేందుకు ఈ కార్డులు అవసరమన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం



రూ.50 వేల ఆర్థిక సహకారం అందజేస్తున్న దాత సాయికృష్ణ

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణంలోని మెయిన్‌రోడ్డుకు చెందిన సుంకరి సాయికృష్ణ, మమత దంపతులు రూ.50 వేల ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థిక సహకారం డబ్బులను ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ భారీ అంచనా వ్యయంతో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభించినట్లు చెప్పారు. ఒక్క శ్లాబ్ కోసమే దాదాపు రూ.40 లక్షల వ్యయం అవుతోందన్నారు. దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఇంకా దాతలు ముందుకొచ్చి అయ్యప్ప ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన బూట్లు



ఎమ్మార్సీ భవనానికి చేరిన బూట్లను సరిచూస్తున్న ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యాకిట్లులో భాగంగా అందించే బూట్లు శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్నాయి. 1521 మంది బాలురుకు సంబంధించిన బూట్లు వచ్చాయని, 1545 మంది బాలికలకు సంబంధించిన బూట్లు రావాల్సి ఉందని ఎంఈఓ సీహెచ్ కూర్మారావు తెలిపారు. అలాగే యూనిఫాం కూడా రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వచ్చిన బూట్లను సోమవారం నుంచి బాలురులకు అందజేస్తామన్నారు. కాగా గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలల పునః ప్రారంభం నాటికి జగన్న విద్యా కానుకల పేరుతో యూనిఫాం, బూట్లు, టై, నోట్ బుక్స్, టెక్ట్స్ బుక్స్, బ్యాగ్‌లు ఇచ్చేవారు. ప్రస్తుతం పాఠశాలలు పునః ప్రారంభమై నెల రోజులు అవుతున్నా ఇంతవరకు విద్యాకిట్లు రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రొటోకాల్‌పై సర్పంచ్‌ల ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్‌లు

జామి: పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించడం లేదని, సర్పంచ్‌లకు గౌరవం ఇవ్వడం లేదని పలువురు సర్పంచ్‌లు శుక్రవారం ఎంపీడీఓ తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ప్రజలు ఎన్నుకున్న తమను కాదని ఎటువంటి పదవులు లేని టీడీపీ కార్యకర్తలతో పింఛన్లు, వరి విత్తనాలు పంపిణీ చేయించారని తెలిపారు. సచివాలయ భవనాలపై ఉన్న నవరత్నాల లోగోను తొలగించాలని ఒత్తిడి తీసుకురావడం మంచిదికాదన్నారు. టీడీపీకి నేతల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఇకనైనా ఇటువంటి అప్రజాస్వామిక చర్యలు మానుకోవాలన్నారు. అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనిచేయిలన్నారు. పద్ధతి మారకపోతే ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, అట్టాడ సర్పంచ్ పి.అమ్మన్నదొర, గొడికొమ్ము సర్పంచ్ పి.భవానీ, జాగరం సర్పంచ్ వసి పార్వతి, జె.డి.వలస సర్పంచ్ సీహెచ్.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన మెనూ పరిశీలన



వేపాడ: అరిగిపాలెం పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలో అరిగిపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన మెనూ, వంటలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం తరగదులకు వెళ్లి విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. నోట్‌బుక్స్ పరిశీలించి దస్తూరీ మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ వేయాలని, పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జామి: మండలంలో ఆర్.బీ.పురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ-2 బి.గంగరాజు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గజపతినగరం రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. మండలంలోని గరికవలస గ్రామానికి చెందిన గుమడావు శంకరరావు లోగిశ గ్రామ సమీపంలో చంపావతి నది నుంచి శుక్రవారం ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శ్మశానంలో షెడ్ నిర్మాణానికి ప్రతిపాదన

వేపాడ: మండలంలోని శింగరాయిలో శ్మశానవాటిక షెడ్ నిర్మాణానికి రూ.5 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు పీఆర్ ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త అప్పారావు షెడ్ నిర్మాణంపై జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందించడంతో ఆయన ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేసి, ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్

కొత్తవలస: ప్రపంచ జూనోసిస్ దినం సందర్భంగా మండలంలోని పశువైద్య కేంద్రాల్లో పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా రేబీస్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు కొత్తవలస డివిజన్ పశువర్ధకశాఖ సహాయ సంచాలకులు గంగాధర్ తెలిపారు. మండలంలోని దెందేరు, వియ్యంపేట, కొత్తవలస పశువైద్య కేంద్రాల్లోను, అలాగే లక్కవరపుకోట మండలం మల్లివీడు, భీమాళి, లక్కవరపుకోట పశువైద్య కేంద్రాల్లోను ఈ ఉచిత వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అలాగే పశువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై జంతు యజమానులకు అవగాహన కల్పించనున్నట్లు చెపపారు. ఈ అవకాశాన్ని శునకాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పురుగు మందు తాగి యువకుడు మృతి

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన కె.చిన్నారావు(23) శుక్రవారం వైజాగ్ కేజీహెచ్‌లో మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై శిరీష్ తెలిపారు. చిన్నారావుకు ఆర్థిక సమస్యలు ఉండటంతో గత నెల 28న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే గజపతినగరం సీహెచ్‌సీకి, అక్కడ నుంచి విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విజయభాస్కరరెడ్డిపై కేసు నమోదు చేయాలి

గజపతినగరం: కొలిమి గుండ్ల ఉపాధ్యాయుడిపై దుర్భాషలాడిన అధికార పార్టీ నాయకుడు విజయభాస్కరరెడ్డిపై పోలీస్‌లు కేసు నమోదు చేయాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు డిమాండ్ చేశారు. గజపతినగరం మండలం కేంద్రంలో శుక్రవారం సాయింత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా కొలిమి గుండ్ల మండలం కోర్నపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుపై స్థానిక టీడీపీ నేత విజయభాస్కరరెడ్డి అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యాయులపై ఇటువంటి హేయమైన చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే విజయభాస్కరరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అవగాహనతోనే డయేరియా దూరం



అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

గజపతినగరం రూరల్: ప్రతీ ఒక్కరు అతిసార వ్యాధిపై అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని మరుపల్లి ఆస్పత్రి ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి అన్నారు. మండలంలోని రామన్నపేట గ్రామంలో శుక్రవారం 'స్టాప్ డయేరియా' కార్యక్రమం నిర్వహిచారు. డయేరియా వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించడం, కాచి చల్లార్చిన నీటిని తాడగం వంటి జాగ్రత్తలతో వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డయేరియాతో బాధపడేవారు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రుంకాన అరుణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలి

• డీపీఓ శ్రీధర్‌రాజ



చీపురుపల్లి: పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజ

చీపురుపల్లి: మేజర్ పంచాయతీలో అన్ని వార్డులు, వీధుల్లోను నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎల్‌వీఎన్ శ్రీధర్‌రాజ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ, విజయాకాలనీ, జి.అగ్రహారం, మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ వీధులు శుభ్రం చేయడంతో పాటు కాలువల్లో పూడికలు తొలగించే ప్రక్రియ నిరంతరం జరగాలన్నారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లల్లోని చెత్తను కాలువల్లో పారబోయకుండా చెత్త సేకరణకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రాము, తదితరులు ఉన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ సుమల శ్యామల శుక్రవారం తెలిపారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పూడికలు తొలిగించినట్లు చెప్పారు. పంచాయతీ నిధులతో తాగునీటి బావులు, చేతిబోర్లు వద్ద క్లోరినేషన్ చేయిస్తున్నామన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



వేపాడ: సోంపురం పాఠశాలలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



గుర్ల: తెట్టంగి హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



ఎస్.కోట: విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న గ్రామపెద్దలు

వేపాడ: మండలంలో సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతులమీదుగా స్టూడెంట్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ, ఎంఈఓ బాలభాస్కరావు, హెచ్‌ఎం బీపీఏ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన థింసా నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

గుర్ల: మండలంలోని తెట్టంగి హైస్కూల్ ప్లస్‌లోని విద్యార్థులకు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు 'స్టూడెంట్ కిట్లు'ను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్‌లు, షూ, తదితర వస్తువులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు జమ్ము లచ్చన్న, నాగులపల్లి నారాయణరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

– **శృంగవరపుకోట:** మండలంలోని వెంకటరమణపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక ప్రజాప్రతినిధుల చేతులమీదుగా శుక్రవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.కోటీశ్వరరావు, ఎంపీటీసీ ఆర్.రామచంద్రరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ మంచిన రాంబాబు, హెచ్‌ఎం జీఎస్‌ఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాడిపంటల వృద్ధిపై దృష్టి పెట్టండి




పింఛన్ల పంపిణీకి సంబంధించిన వివరాలను ఎంపీడీఓ పావనిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

• అధికారులతో ఎమ్మెల్యే కళావెంకటరావు

మెరకముడిదాం: రైతుల జీవనాడి అయిన పాడిపంటల వృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా పింఛన్లపై ఎంపీడీఓ పావని మాట్లాడుతూ.. 1వ తేదీన 90 శాతం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన వారికి తరువాత రోజు ఇచ్చామని తెలిపారు. తహసీల్దార్ వై.వి.పద్మావతి మాట్లాడుతూ ఇంటి స్థలం కోసం 630 దరఖాస్తులు రాగా అందులో 336 మందికి స్థలాలు మంజూరు చేశామని, వివిధ కారణాలతో 293 దరఖాస్తులు రిజక్ట్ అయినట్లు చెప్పారు. అలాగే 9వ విడత పేదలకు ప్రభుత్వ భూమి పంపిణీ కార్యక్రమంలో భాగంగా 772 మంది లబ్ధిదారులకు గాను 760.41 ఎకరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖపై సమీక్షలో ఏఓ శ్రావణితేజ విత్తనాల పంపిణీ, ఖరీఫ్ సాగు ప్రణాళికలను వివరించారు. తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడిస్తుండగా.. ఎమ్మెల్యే కలుగజేసుకుని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరా సరిగా జరగడంలేదని తనకు ఫిర్యాదులు అందుతున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. విద్యుత్‌శాఖకు సంబంధించి ఏఈ రమేష్ మాట్లాడుతుండగా.. గ్రామాల్లో అవసరమున్న చోట రెండుమూడు రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, పార్టీ నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కెంగువ ధనుంజయ, మండల రమణమోహన్‌నాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, పి.సీతారామరాజు, బీజేపీ నాయకుడు సరిధి రాంబాబు, జనసేన నాయకుడు వి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధికి సహకారం



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు: కేంద్ర ప్రభుత్వం 2023లో మంజూరు చేసి శంకుస్థాపన చేసిన గిరిజన యూనివర్సిటీ నిర్మాణం పూర్తయ్యేలా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టి సారించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరిది దుర్గాప్రసాద్ అన్నారు. కోమటిపల్లి కేవీఎస్ కళ్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ అధ్యక్షతన శుక్రవారం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చినమేడపల్లి-మర్రివలస గ్రామాల మధ్య 561 ఎకరాల స్థలం సిద్ధంగా ఉన్నందున కొత్తవలస మండల రెల్లి గ్రామానికి గిరిజన యూనివర్సిటీ తరలిపోకుండా చూడాలని కోరారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, సంవత్సరం వరకు ఎవరూ ఏమీ ఆశించ వద్ద రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున కొంత అందుబాటులో లేకపోయినా కొన్ని సమస్యలు మానాన్న కొండపల్లి కొండలరావు, మండల నాయకులు దృష్టికి తీసుకొస్తే వారు పరిష్కరిస్తారని అన్నారు.